## క్లుప్తంగా

### ఆలయ భూముల వేలం పాటలు



**ముదినేపల్లి రూరల్:** మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ భూముల కౌలు వేలంపాటలు మంగళవారం నిర్వహించారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ ఆలయ చైర్మన్ మీగడ నెలబాలుడు ఆధ్వర్యంలో ఈ పాటలు జరిగాయి. చేవూరు గ్రామంలోని 5.36 ఎకరాల చేపల చెరువును ఏడాదికి ఎకరానికి రూ.56 వేలు లీజు చెల్లించే విధంగా అబ్బిశెట్టి నరేష్ పాడుకున్నారు. సింగరాయపాలెంలోని 1.45 ఎకరాల భూమికి ఏడాదికి రూ.40 వేలు కౌలు చెల్లించేవిధంగా పాట జరిగింది. ఇదే గ్రామంలోని 2.75 ఎకరాల పల్లంభూమికి ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ బోయిన రామరాజు తదితరులు పాల్గొన్నారు.

### మజ్జిగ పంపిణీ



**పామర్రు:** వేసవిలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు బొమ్మారెడ్డి అప్పిరెడ్డి సౌజన్యంతో పామర్రు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని స్థానిక కూడలి వద్ద మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ కె చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం మజ్జిగ ఎంతగానో ఉపయుక్తం అవుతుందన్నారు. సుమారు వెయ్యి మందికి చలివేంద్రం ద్వారా మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బైసాని నాగేశ్వరరావు, తోట రమేష్, గ్రంధం ఆంజనేయప్రసాద్, నవులూరి వీర వెంకయ్య, పెరుమాళ్ల రాధాకృష్ణ, కె.సాల్మన్ రాజు, పీఎంఎస్ ప్రసాద్, గుడివాడ ప్రగతి ప్రెసిడెంట్ వెంకట్రావ్ పాల్గొన్నారు.

### పంట బోదె పనులు



**మండవల్లి:** గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పనులు దోహదం చేస్తున్నాయని ఇన్‌చార్జి ఏపీఓ ఎన్ నవీన్ పేర్కొన్నారు. మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం గ్రామంలో రూ.1.20 లక్షల అంచనా విలువతో పంట బోదె అభివృద్ధి పనులను మంగళవారం 67 మంది ఉపాధి కూలీలు నిర్వహించినట్లు చెప్పారు. ఫీల్డ్‌అసిస్టెంట్,మేట్‌లు పాల్గొన్నారు.

### ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు



**గుడివాడ టౌన్:** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు ఇన్‌చార్జి డీవైఈఓ యూవీ సుబ్బారావు తెలిపారు. ఆయన పట్టణంలోని నాలుగు మున్సిపల్ హైస్కూల్స్, ఫాదర్ బియాంకి బాలికల పాఠశాలలో పరీక్షల నిర్వాహణను మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 10వ తేదీతో ముగియనున్నాయన్నారు. ఇప్పటి వరకు జరిగిన పరీక్షల్లో ఏ విధమైన ఇబ్బందులు తలెత్తలేదని ప్రశాంతంగా పరీక్షలు జరుగుచున్నాయన్నారు. గుడివాడ డివిజన్ పరిధిలోని 19 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2,886 మందికి గాను 2,260 మంది హాజరు కాగా 626 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. గుడివాడ పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో 727 మందికి గాను 593 మంది పరీక్షకు హాజరుకాగా 134 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.



# అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

**ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్**



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

**పమిడిముక్కల:** అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనుమత్స గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అని ఆరా తీశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనలో తేడాను గమనించాలన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధా ప్రవీణ్, తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు శృతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, నాయకులు మస్తాన్‌రావు పాల్గొన్నారు.

# వాటాల రాజాను తరిమి కొడతాం

- మామూళ్లు తీసుకునే నీచ అలవాటు వర్లకే చెల్లు
- వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**పమిడిముక్కల:** వాటాల వర్ల కుటుంబాన్ని నియోజకవర్గం నుంచి తరిమి కొడతామని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. అభివృద్ధే ధ్యేయంగా, అవినీతి రహిత పాలన చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే జోలికొస్తే తరిమి కొడతామన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార రాజా పలు చెరువుల్లో మట్టి తవ్వకాలపై ఎమ్మెల్యే అనిల్ కుమార్‌తో పాటు దళిత సర్పంచ్‌లపై అవాకులు, చవాకులు పేలడాన్ని తీవ్రంగా ఖండించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దోచుకోవడంలో టీడీపీ నాయకులకు మించిన వారెవ్వరూ లేరన్నారు. ఆ విషయాన్ని కుమార్ రాజా తెలుసుకోవాలన్నారు. టీడీపీ హయాంలో నీరు–చెట్టు పేరుతో వందల ఎకరాల్లో చెరువులను తవ్వి మట్టి మాఫియాకు అడ్డాగా నిలిచారని ఆరోపించారు. నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ మారపాక మహేష్ మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేత కుమార రాజా అదే సామాజిక వర్గానికి చెందిన దళిత ప్రజాప్రతినిధులు, నాయకులపై అవాకులు, చవాకులు పేలుతూ దళితద్రోహిగా ముద్ర వేసుకున్నారన్నారు. వర్ల కుమార్ రాజాకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించే స్థాయి లేదన్నారు. అగినపర్రు సర్పంచ్ కోట మణిరాజు మట్లాడుతూ అనుమతులు తీసుకుని చెరువు తవ్వకం చేపట్టి పేదలకు తక్కువ రేటుకే మట్టిని అందిస్తున్నామన్నారు. మట్టి తోలకం విషయంలో పూర్తిగా సమాచారం లేకుండా విమర్శలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్కెపూడి బుజ్జి మాట్లాడుతూ అన్ని శాఖల అనుమతితోనే చెరువులు పూడిక తీస్తున్నామని, ఎక్కడ అవినీతికి పాల్పడలేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ పాల్గొన్నారు.

# బీజేపీ నాయకులకు సత్కారం



సత్కార గ్రహీతలతో బీజేపీ నాయకులు

**గుడివాడ టౌన్:** ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులను సత్కరించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆలమూరి మురళీకృష్ణ, శలంకాయల మురళీకృష్ణ, శీలం శంకరరావు, పెరుమాళ్ల శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ బీజేపీ ఆవిర్భావం నుంచి పార్టీ యువ మోర్చ కార్యకర్తలుగా చేరి ఏ పదవినీ ఆశించకుండా పార్టీకి సేవచేసిన వారిని సత్కరించాలని కేంద్ర కమిటీ పిలుపు మేరకు వీరిని గౌరవించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి అంగడాల సతీష్, నియోజకవర్గ ఇన్‌చార్జి సూరే లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రపోతు అర్జున పాల్గొన్నారు.

# ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై విద్యార్థులకు శిక్షణ



గుడివాడలో పద్యాలు వింటున్న చిన్నారులు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**జమీగొల్వేపల్లి(పామర్రు):** విద్యార్థులు చిన్న నాటి నుంచే సృజనాత్మకమైన విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ద్వారా విద్యార్థులు చక్కటి కళా కృతులను తయారు చేయవచ్చన్నారు. అనంతరం పేపర్లు, ఇతర వస్తువుల ద్వారా విద్యార్థులు చక్కటి కళాకృతులను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో పి ధర్మారావు, పీ పద్మ, చంద్రశేఖర్ ఆజాద్, గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్, పాల్గొన్నారు. పామర్రులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పొడుపు కథలు నేర్పించడం, గణితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని గ్రంథాలయాధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు.

**కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు**

**గుడివాడ టౌన్:** స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు జానపద పద్యాలు నేర్పించారు. గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి అవిర్నేని వెంకటేశ్వరరావు పద్యాలను ఆలపించి చిన్నారులకు వినిపించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగి టి.ప్రవల్లిక పాల్గొన్నారు.

**విద్యార్థులకు ఆటల పోటీలు**

**ముదినేపల్లి రూరల్ :** స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం పలురకాల ఆటలపోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ఇండోర్ గేమ్స్‌తో పాటు గ్రంథాలయావరణలో వివిధ రకాల ఆటలు ఆడించారు. పుస్తకపఠనం చేయించడంతో పాటు నీతి కథలను బోధించారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయాలి



శిక్షణ ఇస్తున్న కో–ఆర్డినేటర్ నాగాంజనేయులు

**గుడివాడ టౌన్:** విద్యార్థులు తమలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు కృషి చేయాలని ఈఎస్‌సీ కో–ఆర్డినేటర్ నాగాంజనేయులు అన్నారు. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జి–20 జన్‌భగీదరి కార్యక్రమంలో భాగంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని ఏఎన్నార్ కళాశాల, కేటీఆర్ మహిళా కళాశాల, కేబీఆర్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ అనేక నైపుణ్యాలు దాగి ఉంటాయన్నారు. వాటిని వెలికి తీసి వ్యక్తిగతంగానూ సమాజానికి వారు ఉపయోగపడేలా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఆ దిశగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపల్ పీజేఎస్ కుమార్, కేటీఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ హరిధర్మేంద్ర, ట్రెనింగ్ ఆఫీసర్లు డి.ఆనంద్‌వేణు, జీఎస్ నరసింహాచారి, పి.శేషుబాబు పాల్గొన్నారు.

### క్రమబద్ధీకరణపై కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం

**మొవ్వ:** 2014వ సంవత్సరానికి ఐదు సంవత్సరాలు సర్వీసు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబబద్ధీకరణ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన పై మొవ్వ మండల పారామెడికల్ కాంట్రాక్టు సిబ్బంది మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. సుదీర్ఘ పాదయాత్రలో కాంట్రాక్టు ఉద్యోగుల బాధలు విన్న జగన్‌మోహన్‌రెడ్డి «నేను విన్నాను.. నేను ఉన్నాను» అంటూ ఇచ్చిన హామీని సఫలీకృతం చేయటం ఆనందదాయక మని పేర్కొన్నారు. అలాగే దీనిపై త్వరలో జీఓ విడుదల చేయాలని కోరుతూ కే రామాంజనేయులు, వి నాగరాజు, ఎం.శ్యామ్ కుమార్, వి.సూర్యప్రకాశరావు, బి.విజయ్ కుమార్, జి.సమిత తమ కృతజ్ఞతలను తెలియజేశారు.

### రేపు మండల పరిషత్ సమావేశం

**పామర్రు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సభ్యుల సమావేశం ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

### కంప్యూటర్ ప్రయోజనాలపై అవగాహన

**మండవల్లి:** స్థానిక శాఖా గ్రంథాలయంలో పిల్లలకు కంప్యూటర్ బేసిక్స్, కంప్యూటర్ ప్రయోజనాలు, ఏయే సమయాల్లో ఏవిధంగా వినియోగిస్తారనే విషయాలపై గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ కంప్యూటర్ బేసిక్స్ నాలెడ్జ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రంథాలయ విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు



**గుడివాడ టౌన్:** పాఠశాలలు ప్రారంభం నుంచే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తామని ఎంఈఓ బీఎస్‌సీ శేఖర్‌సింగ్ అన్నారు. స్టాక్ పాయింట్ నుంచి కిట్లను మంగళవారం పాఠశాలలకు తరలించారు. మండలం, అర్బన్ పరిధిలోని 79 పాఠశాలలకు గాను 15 పాఠశాలలకు వ్యానుల ద్వారా తరలించామని పేర్కొన్నారు. పాఠశాలన్నింటికీ ఇవి చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ ఎ.శేఖర్‌బాబు, కో–ఆర్డినేటర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

# మీసాల వెంకన్నకు లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజకు సిద్ధం చేస్తున్న తులసి దళాలు



మీసాల వెంకన్న స్వామి

**కైకలూరు:** మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కైకలూరు భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా స్వామికి లక్ష తులసి పూజ మంగళవారం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సతీమణి వీరకుమారి దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మీసాల వెంకన్న, రామలింగేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్లు బొప్పన శివకుమార్, బూరుబోయిన మోహనరావు, నాయకులు పంజా రామారావు, బోయిన రామకృష్ణ, లోయ రంగారావు, శ్రీమన్నారాయణ గోష్టి అధ్యక్షురాలు సీహెచ్ హేమలత పాల్గొన్నారు.

# ముస్తాబవుతున్న గుడివాడ



విద్యుత్ దీపాలతో అలంకరించిన నెహ్రూచౌక్ సెంటర్

**గుడివాడ టౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన పురస్కరించుకుని పట్టణంలోని పలు కూడళ్లను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లోని భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలు ఉన్న సర్కిల్‌ను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

# ఉరుసు ఉత్సవాలకు ఎమ్మెల్యే విరాళం రూ.50 వేలు



ఎమ్మెల్యే నాని ఇచ్చిన రూ.50 వేలను దర్గా పెద్దలకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**గుడివాడరూరల్:** మండలంలోని మల్లాయపాలెంలో జరుగుతున్న హజరత్ సయ్యద్ సాలార్‌షా ఔలియ ఖాదరి ఉరుసు మహోత్సవాలకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) రూ.50 వేలు కానుకగా సమర్పించారు. ఎమ్మెల్యే నాని సమకూర్చిన నగదును వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఖాదరీబాబా దర్గా పెద్దలకు మంగళవారం అందజేశారు. దర్గా అభివృద్ధికి దశాబ్దన్నరకుపైగా ఎమ్మెల్యే కొడాలి నాని అందిస్తున్న సహకారం మరువలేనిదని దర్గా పెద్దలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణాధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల శ్రేయస్సు, ముస్లిం ప్రార్థనా మందిరాలు, పవిత్ర దర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే కొడాలి నాని ప్రభుత్వ పరంగానే కాకుండా, వ్యక్తిగతంగా కూడా ఎంతో కృషి చేస్తున్నారన్నారు. బాబావారీ ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలతో పాటుగా ఎమ్మెల్యే కొడాలి నాని సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్ ఖాదరి బాబా దర్గా పెద్దలు యాకూబ్, అఫ్జల్‌బేగ్, అమీన్‌బేగ్, మెయిన్‌బేగ్, అబ్దుల్ తాజుద్దీన్, మైనార్టీ సెల్ నేతలు సాలెహా ఎండీ, షేక్ రజాక్‌భాష, షాకిర్ పాల్గొన్నారు.

# ఘనంగా హరిత వన మహోత్సవం



మొక్కల సంరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్కిల్ అధికారులు

**కురుమద్దాలి(పామర్రు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష మేరకు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ చేపట్టిన జీ 20 జాన్ భాగిదరీ అనే కార్యక్రమంలో భాగంగా ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ (హరిత వన మహోత్సవం)ను నిర్వహించామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని కురుమద్దాలి స్కిల్ హబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు వివిధ అంశాలపై పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ (హరిత వన మహోత్సవం) నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన ఏడు స్కిల్ హబ్‌లలో స్కిల్ కాలేజీలు , వివిధ విద్యా సంస్థల నందు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ తెలిపారు. కురుమద్దాలి స్కిల్ హబ్‌లోని విద్యార్థులు ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థులతో మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించామని పేర్కొన్నారు. అంతే కాకుండా హబ్ ప్రాంగణంలో పలు మొక్కలను నాటించి, వాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగించామని తెలిపారు.

# ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటాలి



మండవల్లి హైస్కూల్లో సింధూరం మొక్కలు నాటుతున్న విజయ్‌కుమార్, భాస్కరరావు

**మండవల్లి:** పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పర్యావరణ మార్పుల దృష్ట్యా ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటితే దేశం సస్యశ్యామలం అవుతుందని సుధామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రెండో రోజు ఐక్య వేదిక మండలశాఖ, స్థానిక హైస్కూల్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో సింధూరం మొక్కలు నాటి, ట్రీ గార్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్, భాస్కరరావు, హెచ్‌ఎం జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొక్కలు నాటితే అవి వృక్షాలుగా మారి ఎన్నో ఫలితాలు ఇస్తాయన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక టి.అప్పారావు పాల్గొన్నారు.

### సుబ్బారాయుడికి విరాళం



విరాళమందజేస్తున్న దాతలు

**ముదినేపల్లి రూరల్:** ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి దాతలు మంగళవారం విరాళమందించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం కలవపూడి గ్రామానికి చెందిన పెన్మెత్స దుర్గాప్రసాద్‌రాజు,శ్రీదేవి దంపతులు అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళం ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజుకు అందజేశారు.